ఈతకు వెళ్లి ఇద్దరి దుర్మరణం

మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

సతీశ్ (ఫైల్)

కార్తీక్ (ఫైల్)

- మృతులు వరుసకు బావబామ్మర్దులు
- బక్కతండాలో విషాదం
- నివాళులర్పించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట, అక్టోబర్ 28 : అమ్మమ్మ ఇంటికి వచ్చి సరాదగా ఈతకు వెళ్లిన బావబామ్మర్దులు మృతి చెందిన ఘటన మండలంలోని బక్కతండాలో శనివారం జరిగింది. ఎస్సై జీ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ సతీశ్(17) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం పోలారం శివారు భద్రుతండాలో ఉంటున్న మేనత్త కుమారుడు వాంకుడోత్ కార్తీక్ (16) ఈ నెల 27న సతీశ్ తండ్రి పోట్యాకు భోజనం ఇచ్చేందుకు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో ఎండ ఎక్కువగా ఉండడంతో ఆకేరువాగులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముందుగా కార్తీక్ వాగులోకి దిగాడు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతుండగా, గమనించిన సతీశ్ కాపాడేందుకు వాగులోకి దిగాడు. భయంతో కార్తీక్ సతీశ్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరు వాగులో మునిగిపోయారు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడం, ఫోన్ కూడా ఎత్తకపోవంతో కుటుంబసభ్యులు నర్సింహులపేట, జయపురం ప్రాంతాల్లో ఇద్దరి కోసం వెతికినా జాడ దొరకలేదు. మధ్యాహ్నం భోజనం ఇచ్చిన తర్వాత నుంచి కనిపించకపోవడాన్ని గుర్తించి పంట భూముల వద్ద వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో వాగు పక్కన బైక్‌తో పాటు దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 12 గంటల సమయంలో వాగు వద్దకు చేరుకున్న పోలీసులు లైట్ల సహాయంతో వెతకగా, ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. పోట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ సతీశ్, కార్తీక్ మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సత్తిరెడ్డి, అశోక్‌రెడ్డి, లింగారెడ్డి, రాందాస్, రామ్మూర్తి, సురేశ్ ఉన్నారు.

16 కిలోల ఎండు గంజాయి, నిందితుడిని చూపిస్తున్న సీఐ హతీరాం, ఎస్సై జానీపాషా

16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- దాని విలువ సుమారు రూ.4లక్షలు
- ఒకరి అరెస్టు : సీఐ హతీరాం

నెక్కొండ, అక్టోబర్ 28 : నెక్కొండలో సుమారు రూ .4 లక్షల విలువైన ఎండు గంజాయి పట్టుబడినట్లు సీఐ హతీరాం శనివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జానీపాషాతో కలిసి సీఐ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం అరుణక్కనగర్‌కు చెందిన తుంగపిండి రాము నెక్కొండ రైల్వేస్టేషన్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి గుండ్రపల్లి రోడ్డు వైపు రెండు సంచుల్లో 16 కిలోల గంజాయిని తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన బైన దినేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి వరంగల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు నిందితుడు చెప్పినట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై జానీపాషా, సిబ్బంది రమేశ్, అన్వర్, ఆర్పీఎఫ్ సిబ్బందిని సీఐ అభినందించారు.

సావనీర్‌ను విడుదల చేస్తున్న వైవీఎస్ఎస్ సన్యాసిరాజు

నిట్‌లో అంతర్జాతీయ సదస్సు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : వరంగల్ నిట్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో కంప్యూటేషనల్ మోడలింగ్ (ఐసీసీఎంఎస్ఈ- 2023)పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్‌తో కలిసి గణితశాస్త్ర విభాగం ఈ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సుకు సంబంధించిన సావనీర్ ను ముఖ్య అతిథి ప్రొఫెసర్ వైవీఎస్ఎస్ సన్యాసిరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్ థీమ్ పరిశోధకులను ఆకట్టుకునేలా ఉందని, మ్యాథమెటికల్ మోడలింగ్, న్యూమరికల్ అనాలిసిస్, ఫ్లూయిడ్ మెకానిక్స్, కంప్యూటేషనల్ హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అంశాలపై వేదిక చర్చించనుందన్నారు. గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ బెనర్జీబాబు మాట్లాడుతూ.. శాఖ ప్రారంభం నుంచి సాధించిన మైలురాళ్ల గురించి వివరించారు. డిపార్ట్‌మెంట్ రెండు కొత్త ప్రోగ్రామ్‌లను ప్రారంభించిందని, ఒకటి నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ, బీఎడ్, మరొకటి నాలుగేళ్ల బీటెక్(మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్) అని తెలిపారు. ఆరుగురు విద్యార్థులతో డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం వివిధ విభాగాల్లో 268 మంది ఉన్నారని చెప్పారు. డీన్ (స్టూడెంట్స్ వెల్ఫేర్) అండ్ కాన్ఫరెన్స్ చైర్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య కాన్ఫరెన్స్ థీమ్ గురించి వివరించారు. సాంకేతిక సెషన్‌లు, పేపర్ ప్రజెంటేషన్‌లు, ముఖ్య ప్రసంగంతో పాటు ఈ సమావేశంలో నాలుగు ఆహ్వానిత ఉపన్యాసాలు, తొమ్మిది ఎండోమెంట్ ఉపన్యాసాలు ఉంటాయని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 150 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారన్నారు. ఏపీటీఎస్ఎంఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎన్ కిషన్, కార్యదర్శి సీ జయ సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్ గురించి వివరించారు. ఐసీసీఎంఎస్ఈ-2023 ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ప్రొఫెసర్ సీహెచ్ రాంరెడ్డి, ప్రొఫెసర్ జే ప్రణీత, ప్రొఫెసర్ ఏ బెనర్జీ బాబు, ప్రొఫెసర్ ఈ సత్యనారాయణ, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ప్రొఫెసర్ కే కళాధర్, ప్రొఫెసర్ జే శ్రీనివాస్ వ్యవహరించారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 28 : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణిమ సందర్భంగా శనివారం వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించామని టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామం, చెన్నరావుపేట మండలంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపారని చెప్పారు. అలాగే, భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మద్దులపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరేడు గ్రామం, జనగామ జిల్లా ఓబుల్ కేశ్వాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారని వెల్లడించారు. వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వివరించారు.

రూ.500 కోట్ల వ్యాపారమే లక్ష్యం

- అటవీ ఉత్పత్తులతో ఆదాయం పెంచాలి
- జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాంనాయక్

అటవీ ఉత్పత్తుల ధరల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాం నాయక్, జీసీసీ అధికారులు

ఏటూరునాగారం, అక్టోబర్ 28 : గిరిజన సహకార సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ఉద్యోగులు శ్రమించాలని జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాం నాయక్ కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శనివారం జీసీసీ డివిజన్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మన్ననూరు, భద్రాచలం, ఏటూరునాగారం డివిజన్లలో రూ. 500 కోట్ల వ్యాపారం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ. 400 కోట్ల వ్యాపారం జరిగినట్లు వివరించారు. ఈ ఏడాది అత్యధికంగా అటవీ ఉత్పత్తులు సేకరించడం ద్వారా గిరిజనుల ఆదాయం పెంచేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అటవీ ఉత్పత్తుల సేకరణపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఏటూరునాగారం డివిజన్ పరిధిలో ఎక్కువ శాతం విషముష్టి గింజల ఉత్పత్తి జరుగుతుందని, కనీసం రెండు వేల క్వింటాళ్ల సేకరణ జరగాలని, గిరిజనులకు రూ. కోటి ఆదాయం లభించేలా చూడాలని సూచించారు. అటవీ ఉత్పత్తుల సేకరణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ధరల పట్టిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డివిజనల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యాలయ మేనేజర్ సత్యనారాయణ, బ్రాంచి మేనేజర్లు శ్రీనివాస్, దేవ్, హరిలాల్, సమ్మయ్య, డివిజన్ పరిధిలోని సేల్స్‌మెన్లు పాల్గొన్నారు.

రక్తదానం.. మరో ముగ్గురికి ప్రాణదానం

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

రక్తదానం చేసిన సిబ్బందికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ

సుబేదారి, అక్టోబర్ 28 : రక్తదానం చేయడం ద్వారా మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ఆర్మ్‌డ్ రిజర్వ్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు శాంతి భద్రతలు కాపాడమే కాకుండా సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించి ప్రతి ఒక్కరు రక్తదానం చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, రాగ్యానాయక్, ఏవో రామకృష్ణ, స్వామి, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేందర్, జితేందర్‌రెడ్డి, భోజరాజు, కృష్ణ, విజయ్‌కుమార్, ఆర్ఐలు శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఫర్జున్ రాజు, ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, సుజాత, వెంకన్న, లక్ష్మీనారాయణ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్, ఎంజీఎం దవాఖాన రక్తనిధి డాక్టర్ ఆశా పాల్గొన్నారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలు ఉంటే వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల చేయాలని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ప్రజల నుంచి ప్రత్యక్షంగా ఫిర్యాదులు స్వీకరించడం లేదన్నారు. ప్రజల తమ ఫిర్యాదులను 8712685257 పంపించొచ్చని తెలిపారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు

న్యూశాయంపేట, అక్టోబర్ 29 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఎంఎస్సీ స్టాటిస్టిక్స్, ఎంఏ పొలిటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కాకతీయ యూనివర్సిటీ అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ కే దయాకర్ తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థినులు మూడో దశ పీజీ అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని చెప్పారు. కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. వివరాలకు క్యాంపస్ ప్లేస్‌మెంట్, హెల్త్ సూపర్‌వైజర్, స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్ కో ఆర్డినేటర్లు విజయలక్ష్మి, సాంబలక్ష్మి 9652588339, 9989416499 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

20 లీటర్ల గుడుంబా సీజ్

స్వాధీనం చేసుకున్న గుడుంబా, నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ భిక్షపతి

గూడూరు, అక్టోబర్ 28 : ఎక్సైజ్‌శాఖ అధికారులు చేసిన రూట్ వాచ్‌లో 20లీటర్ల గుడుంబా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హాంతండాలో శనివారం రూట్ వాచ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ద్విచక్ర వాహనదారుడు బానోత్ రాకేశ్‌ను ఆపి తనిఖీ చేయగా, 20లీటర్ల గుడుంబా లభ్యమైంది. గుడుంబాతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. సిబ్బంది బుచ్చయ్య, సుధాకర్, యుగంధర్ పాల్గొన్నారు.